క్లుప్తంగా

వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి



పి.గన్నవరంలో ఎస్టీయూ వజ్రోత్సవ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ నాగలక్ష్మి

పి.గన్నవరం: ఈనెల 12, 13 తేదీల్లో కర్నూలులో జరగనున్న ఎస్టీయూ రాష్ట్ర వజ్రోత్సవ వేడుకలో ఉపాధ్యాయులంతా పాల్గొనాలని సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం తన కార్యాలయంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి ఆవిష్కరించారు. అలాగే ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్లు, ఫోన్ డైరీ, సీఎల్ పుస్తకాలను ఆమె విడుదల చేశారు. ఎస్టీయూ మండలశాఖ గౌరవాధ్యక్షుడు కత్తుల ఆనందరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నల్లా బాలాజీ, బళ్ల శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి నీతిపూడి శ్రీనివాస్, ముద్రగళ్ల జగదీశ్వర రావు, చిక్కం రవికుమార్, రాణి శేషగిర రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భవానీల కలశాల పూజ



మాచవరంలో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భవానీలు

అంబాజీపేట: మాచవరం దొమ్మేటి సత్యమోహన్, సత్యకుమారి దంపతుల ఇంటి వద్ద గురుభవానీలు దంగేటి సాయిబాబు, మాతా భవానీ మల్లేశ్వరి, మట్టపర్తి ఏసు గురుభవాని, మట్టపర్తి ప్రసాద్ గురుభవానీల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి 54 కలశాల పూజను ఘనంగా నిర్వహించారు. గణపతి, చండీ హోమం, అమ్మవారికి కుంకుమార్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. అంతకుముందు 54 కలశాలతో స్థానిక రామ్‌ఘాట్ కౌశిక నుంచి భవానీల శరణుఘోషతో జలాలను తీసుకువచ్చి సహస్ర నామాలతో అమ్మవారి కలశాల, కుంకుమార్చన జరిపించారు. పూజ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో భవానీలతో పాటు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భవానీలు, అయ్యప్పస్వాములు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు కొత్త పింఛన్ల పంపిణీ

పి.గన్నవరం: మండలంలో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు మంగళవారం పి.గన్నవరం మండల పరిషత్ సమావేశ మందిరంలో పంపిణీ చేస్తారని ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

5 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

ఆలమూరు: మండలంలో ఈనెల ఐదు నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం కానుందని ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వారానికి రెండు రోజుల చొప్పున ఈ జగనన్న ఆరోగ్య సురక్ష జరగనుందన్నారు. ఈనెల ఐదున జొన్నాడ-1 గ్రామ సచివాలయంలో ప్రారంభమై జూన్ 14న మూలస్థాన అగ్రహారం-2 గ్రామ సచివాలయ పరిధిలో ముగుస్తుందన్నారు. పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి వైద్య సేవలను పర్యవేక్షించనున్నారన్నారు.

8న వెంకన్నకు లక్షతులసి పూజ

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామికి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే లక్షతులసి పూజ మహోత్సవాన్ని ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ లక్షతులసి పూజలో పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో స్వామికి పూజ నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్లు తెలిపారు. అంతకు ముందు ధనుర్మాసం సందర్భంగా స్వామిని పల్లకీలో ఊరేగిస్తూ గ్రామోత్సం నిర్వహించారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

మామిడికుదురు: పాశర్లపూడి కొండాలమ్మ తల్లి ఆటో యూనియన్ సమావేశం సోమవారం పాశర్లపూడిలో జరిగింది. మండల ఆటో యూనియన్ కార్మిక సంఘం అధ్యక్షుడు తాడి రాజేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుడుపూడి సుబ్రహ్మణ్యం, వైస్ ప్రెసిడెంట్‌గా బండారు చక్రి, కార్యదర్శిగా బొమ్మిడి రాంబాబు, సంయుక్త కార్యదర్శిగా నాగళ్ల సత్తిబాబు, కోశాధికారిగా కోళ్ల తరుణ్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో జిల్లా ఆటో యూనియన్ సహాయ కార్యదర్శి చింతపల్లి సతీష్, కడలి రామకృష్ణ, గొల్లమందల రవి, బళ్ల చిన్న, తాడి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



నగరంలో న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు



కత్తిమండలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావుకు శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ శ్రేణులు



పెదపళ్లలో నూతన సంవత్సర వేడుకలను జరుపుకొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు



విశ్వేశ్వరాయపురంలో జెడ్పీటీసీ ప్రసన్నకుమారికి న్యూ ఇయర్ విషెస్ చెబుతున్న ఉపాధ్యాయులు

అంబరాన్నంటిన సంబరాలు

- ఘనంగా నూతన వేడుకలు
- కేక్‌లు కట్ చేసిన పంచిన ఎమ్మెల్యేలు చిర్ల, కొండేటి, రాపాక



గోపాలపురంలో భారీ కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

కొత్తపేట/రావులపాలెం: నియోజకవర్గంలో ఆంగ్ల సంవత్సర అరంభ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. 2023 సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2024 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ నియోజకవర్గంలో ఆదివారం అర్ధరాత్రి ప్రజలు ముఖ్యంగా యువకులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రధాన నాయకుల లోగిళ్లు అభిమానులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా గోపాలపురంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఇంట నూతన సంవత్సర వేడుకలు అంబరాన్ని తాకాయి. జగ్గిరెడ్డికి శుభాకాంక్షలు చెప్పేందుకు నియోజకవర్గ వ్యాప్తంగానే కాక జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల అధికారులు, అనధికారులు, సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అత్యధిక సంఖ్యలో గోపాలపురానికి క్యూ కట్టారు. న్యూ ఇయర్ కేక్‌లు, బొకేలు, పూల మాలలతో తరలివచ్చి ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు. ప్రతిగా జగ్గిరెడ్డి వారిని సాదరంగా ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంట న్యూ ఇయర్ వేడుకల్లో భాగంగా అముడ చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు తనయుడు, కొత్తపేట మండల యువజన విభాగం కన్వీనర్ గొల్లపల్లి స్వరూప్‌రాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వివిధ ఈవెంట్స్, స్మోక్ విన్యాసాలు, భారీ కేక్ విశేషంగా ఆకట్టుకున్నాయి. జగ్గిరెడ్డినుద్దేశించి యువకుల నృత్యంతో కూడిన పాటలు, ఆర్కెస్ట్రా జనాన్ని ఉర్రూతలూగించాయి. 6 అడుగుల పొడవు, 6 అడుగుల వెడల్పుతో 9 బాగాలుగా రూపొందించిన జగ్గిరెడ్డి చిత్రంతో డిజిటల్ డ్రాయింగ్‌ను నృత్య రూపకం, కోల్డ్‌ఫైర్ నడుమ ఒకదానికొకటి జతచేయగా స్వరూప్ ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి అందజేశారు. అనంతరం 100 కేజీల భారీ కేక్‌ను నాయకుల సమక్షంలో జగ్గిరెడ్డి కట్ చేసి అందరికీ పంచారు. కార్యక్రమంలో కొత్తపేట మండలం నుంచి అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీలు మార్గన గంగాధరరావు, కర్రి లక్ష్మీవెంకటనాగదేవి, తోరాటి లక్ష్మణమూర్తి తదితరులు పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి జగ్గిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావు, తదితర నాయకుల ఇంట న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వారికి ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

కత్తిమండలో..

మలికిపురం: రాజోలు నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం జరిగాయి. ప్రజలంతా కొత్త సంత్సరానికి ఘన స్వాగతం పలికారు. వివిధ రకాల పూలబొకేలతో తమ అభిమాన నాయకులను కార్యకర్తలు, ఉన్నత ఉద్యోగులను చిరుద్యోగులు కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మలికిపురం మండలంలోని కత్తిమండ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇంటి వద్ద జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఎమ్మెల్యే రాపాకకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి ఎమ్మెల్యే పంచారు. ఆయన మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ప్రజలంతా మరింత ఉత్సాహంగా ఉండాలని వారికి శుభాలు జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు బల్ల ప్రసన్నకుమారి, కుసుమ వనజకుమారి, మట్టా శైలజ, దొండపాటి అన్నపూర్ణ, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రోజారమణి, పార్టీ నాయకులు కునాథరాజు చంటిరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల వీర బ్రహ్మజీ, కేఎస్ఎన్ రాజు, పాటి శివకుమార్, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండల శాఖ పార్టీ అధ్యక్షులు, వైస్ ఎంపీపీలు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకొని వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు, స్థానికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అంబాజీపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుకు, గంగలకుర్రులో జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలను వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దారు, ఏఓ, విద్యుత్ శాఖ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, ఉద్యాన పరిశోధన కేంద్రాలు కిటకిటలాడాయి.

మలికిపురంలో..

మలికిపురం: స్థానిక జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి ఇంటి వద్ద సోమవారం నూతన సంవత్సర వేడుకలు వైభవంగా జరిగాయి. కేక్ కట్ చేసి ఆమె వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు, అభిమానులకు పంచారు. ఎంఈఓ విజయశ్రీ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆమెకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఆమె కార్యకర్తలతో మాట్లాడుతూ కొత్త ఏడాదిలో జరిగే ఎన్నికల్లో జగన్ మరోసారి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు బల్ల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

నిరాడంబరంగా వేడుకలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రజలు, ఉద్యోగులు నిరాడంబరంగా నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు.అలాగే మండలంలోని వివిధ ప్రజాప్రతినిధులకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో, పంచాయతీ కార్యాలయాల్లో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలు జరుపుకొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సోమవారం వాడవాడలా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముంగిట కొత్త సంవత్సరం 2024కు స్వాగతం పలుకుతూ ముగ్గులు వేశారు. రామేశ్వరంలో జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, అంతర్వేదిపాలెంలో ఎంపీపీ వీరా మల్లిబాబు, సఖినేటిపల్లిలో ప్రముఖ దాత డి.శ్రీనురాజు ఇళ్ల వద్ద అభిమానుల సందడి నెలకొంది. బొకేలతో వారికి స్థానికులు శుభాకాంక్షలు చెప్పారు. అలాగే సఖినేటిపల్లి పంచాయతీ వద్ద ఏర్పాటు వేడుకల్లో సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు గొల్లమందల చిట్టిబాబుకు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లి ప్రేమానందం, కొల్లా బత్తుల చిట్టిబాబు బొకేతో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండలంలోని మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు రైతులు ఘనంగా నిర్వహించారు. రాజోలు తాలూకా సమష్టి వ్యవసాయ సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సీపీసీ చైర్మన్ ఓగూరి టాండన్‌రాజుకు, వరికంకులు, బొకేలతో శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రజలు, రైతులు సుఖ శాంతులతో ఉండాలని టాండన్‌రాజు ఆకాంక్షించారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా పలు గ్రామాల్లో కేకులు కట్ చేశారు. సోమవారం ఉదయం ఆలయాలు, చర్చిలకు వెళ్లి ప్రార్థనలు చేశారు. బెల్లంపూడిలోని సెయింట్ మాథ్యూస్ లూథరన్ చర్చిలో రెవరెండ్ ఎస్.ఏసుపాదం ఆధ్వర్యంలో నూతన సంవత్సక వేడుకలు జరిగాయి. ఆయన కేకు కట్ చేసి, పిల్లలకు పంచారు. సంఘ పెద్దల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. సంఘ పెద్దలు బళ్ల మోషే, రొక్కాల శ్రీను, తల్లాబత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం నగరం గ్రామంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును ఆయన నివాసం వద్ద కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలు అందించి చిట్టిబాబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎమ్మెల్యే ఇంట న్యూ ఇయర్ వేడుక

మామిడికుదురు: న్యూ ఇయర్ వేడుకలు సోమవారం నగరంలో ఘనంగా జరిగాయి. పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు స్వగృహం వద్ద నియోజకవర్గానికి చెందిన పార్టీ శ్రేణులు భారీగా పాల్గొని ఎమ్మెల్యే చిట్టిబాబుకు న్యూ ఇయర్ విషెష్ తెలియజేశారు. పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో, సిరి సంపదలతో అభివృద్ధి చెందాలని అభిలాషించారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానం వేద పండితులతో పాటు అయినవిల్లి వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అర్చకులు ఎమ్మెల్యే చిట్టిబాబును ఆశీర్వదించి స్వామి వారి ఆశీస్సులతో పాటు వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో రెండు ఆలయాల ధర్మకర్తల మండలి చైర్మన్లు చిట్టూరి రామకృష్ణ, గుత్తుల నాగబాబు, ఈఓ జి.మాధవి, పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతల పంపిణీ



శివకోడులో అయోధ్య రాముని అక్షతలు పంపిణీ చేస్తున్న బీజేపీ కార్యకర్తలు



మాగాంలో అయోధ్య రాముని అక్షతలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

రాజోలు: మండలంలోని రాజోలు, శివకోడు, సోంపల్లి గ్రామాల్లో అయోధ్య నుంచి వచ్చిన బాల రాముని అక్షతల కలశాలతో శ్రీరాముని మంత్రం జపిస్తూ ఆదివారం గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటింటికి అయోధ్య అక్షింతలను భక్తిశ్రద్ధలతో పంపిణీ చేశారు. అక్షతలతో పాటు శ్రీరాముని ఆలయ ఫొటో, ఆలయ చరిత్ర వివరించే కరపత్రాలు, ఈ నెల 22న అయోధ్యలో జరిగే రామ విగ్రహ ప్రతిష్ఠ ఆహ్వాన పత్రాలు అందజేశారు.

మాగాంలో..

అయినవిల్లి: మండలంలోని మాగాంలో లోక కల్యాణం కోసం ప్రతి ఇంటికీ అయోధ్య రామయ్య అక్షతలు బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వేటుకూరి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పి.గన్నవరం నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది. జనవరి 1 నుంచి 15 వరకు గ్రామాల్లో ప్రతి ఇంటికి అక్షతలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుడుపూడి చంద్రశేఖర్, రాష్ట్ర ఓబీసీ కార్యవర్గ సభ్యులు కొప్పనాతి శ్రీరామచంద్రమూర్తి, పసలపూడి శ్రీనివాస్, యనమదల వెంకటరమణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ మాట తప్పలేదు... మడమ తిప్పలేదు

ఎమ్మెల్యే చిట్టిబాబు



నగరంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.3 వేలకు పెంచడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం జరిగిన సమావేశంలో చిట్టిబాబు మాట్లాడారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో సీఎం జగన్ ఎక్కడా మాట తప్పలేదు, మడమ తిప్పలేదన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో జగన్‌కు ఎవరూ చాటి రారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు గతంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. పెంచిన పింఛన్ సహాయం పంపిణీ కార్యక్రమం మంగళవారం నుంచి నియోజకవర్గవ్యాప్తంగా అమలవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు పండగ వాతావరణంలో నిర్వహించాలని చెప్పారు. పార్టీ శ్రేణులు పెంచిన పింఛన్ పంపిణీలో భాగస్వాములు కావాలని చిట్టిబాబు పిలుపునిచ్చారు. సమావేశంలో అప్పనపల్లి దేవస్థానం చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఎంపీటీసీ జాలెం అనూష, పార్టీ నేతలు తేతల మోహనరెడ్డి, యూవీవీ సత్యనారాయణ, చిక్కం బుజ్జిబాబు, అన్వర్ తాహిర్ హుస్సేన్, కడలి శ్రీనివాస్, జాలెం కృష్ణారావు పాల్గొన్నారు.

మంచుకురిసే వేళలో...



అంబాజీపేటలో దట్టమైన మంచులో ప్రయాణిస్తున్న వాహన దారులు

మండలంలో సోమవారం ఉదయం పది గంటలైనా మంచు వీడలేదు. వాహన చోదకులు దారి కనబడక ఇబ్బంది పడ్డారు. ప్రధాన రహదారుల్లో మంచు వల్ల దారి కనబడకపోవడంతో వాహనదారులు, సైక్లిస్టులు తడబాటు పడ్డారు. ప్రజలు మంచును తట్టుకోలేక ఇళ్ల నుంచి బయటకు రాలేకపోయారు. దట్టమైన మంచును సూర్యుడు చీల్చుకుని బయటకు వచ్చాడు. మంచుతో పాటు చలి కూడా విపరీతంగా ఉండటంతో ప్రజలు వణికిపోతున్నారు. ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని ప్రయాణికులు భయపడ్డారు. పగలు అధిక ఉష్ణోగ్రత, రాత్రి చలితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. కాగా మంచు కారణంగా మామిడి పూత పూయదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– అంబాజీపేట

వీరేశ్వరుని దర్శించుకున్న కలెక్టర్

ఐ.పోలవరం: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సోమవారం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు యనమండ్ర సుబ్బారావు, పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తిలు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఆయనకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కలెక్టర్ వెంట సర్పంచ్ కాశే రాజుబాబు తదితరులున్నారు.